TE TL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:107 | 30-08-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల 3/-



## పుష్కర పనులకు శ్రీకారం

- రూ.49 కోట్లతో భద్రాచలంలో ఘాట్ల అభివృద్ధి
- మార్చి 30లోగా పనులు పూర్తి చేస్తాం: కలెక్టర్ అంకిత్

4






# మెట్రో స్టేషన్లలో ఆన్‌లైన్ సమస్యలు

- ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు తెరుక ప్రయాణికుల ఇబ్బంది
- అంతా సర్దుకుందంటున్న మెట్రో అధికారులు

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :**

హైదరాబాద్ మెట్రో రైలు సేవల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో మెట్రో అధికారులు స్పందించారు. ప్రస్తుతం నగరంలో మెట్రో రైలు సేవలు సాఫీగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. మెట్రో స్టేషన్లలోనూ ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేవన్నారు. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో సేవలు

మిగతా 3వ పేజీలో..



## ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

2

- సీఎం రేవంత్ రెడ్డితో కేకే కమిటీ సుదీర్ఘ సమావేశం
- ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయండి : సీఎం ఆదేశాలు
- ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టీకరణ

## అర్హులైన ఏ ఓటరు పేరు తొలగకూడదు

- ఎన్నికల ప్రధాన అధికారికి ముఖ్యమంత్రి లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)

మిగతా 2వ పేజీలో..





## మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంతో మారిషస్ బృందం భేటీ

2

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం: జూపల్లి

- శామీర్‌పేట్, సోమశిలలో కొత్త గోల్ఫ్ కోర్సుల ఏర్పాటు
- పీపీపీ విధానంలో ప్రపంచస్థాయి వసతుల అభివృద్ధి
- 1 నుంచి తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నీ
- ప్రచారకర్తగా దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ సేవలు

2






## మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసింది కాంగ్రెస్సే

- మోదీ సంక్షేమంతోనే నిజమైన సాధికారత
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

2

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 :**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ దేశంలో విభజన రాజకీయాలు చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



## రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం

- సమగ్ర విత్తన చట్టానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- కేంద్రం జాప్యం చేసినా కొత్త చట్టం తెస్తామన్న మంత్రి తుమ్మల

2

రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావడంలో ఇక ఎలాంటి జాప్యం ఉండకూడదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వచ్చే పంటకాలానికైనా రైతులకు మేలు జరిగేలా విత్తన చట్టాన్ని అమల్లోకి తెచ్చే తదుపరి చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో విత్తన చట్టం2025పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, నాణ్యత, నియంత్రణ, విక్రయాలు, ధరల నియంత్రణతో పాటు విత్తన ఉత్పత్తి రైతుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.



2

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై దానం ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :**

ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూంల లక్కీ డ్రాలో ప్రొటోకాల్ రగడ నెలకొంది. ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎస్పీ అరుణ్‌కుమార్

7





## సాంకేతికత ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచి

- క్లస్టర్-3లో నల్గొండ.. క్లస్టర్-4లో సూర్యాపేట ప్రథమం

# అర్హులైన ఏ ఓటరు పేరు తొలగకూడదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కు ఆయన లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతోపాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా (ఏఎస్ డీడీ) గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకర మని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానించలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు.

## ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ ప్రక్రియను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీవో నెం. 679 ద్వారా ఏర్పడిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవ రావు (కేకే) నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శనివారం కలిసింది. ఈ కీలక సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా 13,000 మందికి పైగా ఉద్యమకారులు, వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులతో నిర్వహించిన విస్తృతస్థాయి సంప్రదింపుల వివరాలను, ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా నివేదికను కమిటీ ముఖ్యమంత్రికి అందజేసింది.

**వేగంగా పరిపాలనా సహకారం**

కమిటీ నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి ఉద్యమకారుల రుణాన్ని తీర్చుకోవడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యమకారుల దరఖాస్తుల స్వీకరణకు డిజిటల్ పోర్టల్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా సమన్వయం చేసుకుంటూ పరిపాలనాపరమైన పూర్తి సహకారాన్ని కమిటీకి అందించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో 679 జారీ చేయడమే కాక ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలాలు, ఆసరా పెన్షన్, హెల్త్ కార్డ్స్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఉద్యోగులకు గౌరవ గుర్తింపు మొదలైన అంశాలపై సానుకూలంగా స్పందించినందుకు కమిటీ చైర్మన్ కేకే, కోదండరామ్స, భ్యులు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎంపీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి. శషాద్రి, కార్యదర్శులు ఎస్.శ్రీధర్, చంద్రశేఖర్ రెడ్డి, వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గోల్కొండ గోల్ఫ్ క్లబ్‌లో 'తెలంగాణ గోల్కొండ మాస్టర్స్' 12వ ఎడిషన్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో ఒక గోల్ఫ్ కోర్సును, కృష్ణా నది తీరంలోని సోమశిల (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్) ప్రాంతంలో మరొక ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్ర పర్యాటక, క్రీడల ప్రచారం కోసం భారత క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ సేవలను ఉపయోగించుకోనున్నట్లు వెల్లడించారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

**సెప్టెంబరు 1 నుంచి టోర్నీ – రూ.కోటి ప్రైజ్‌మనీ**

డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ టూరిజం సహకారంతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నాయి. సెప్టెంబరు 1 నుండి 4వ తేదీ వరకు నిర్వహిస్తారు. దేశవిదేశాల నుంచి 132 మంది ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటారు ప్రైజ్‌మనీ రూ. కోటి ఉంటుంది. డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సహకారం అభినందనీయమని, ఈ పోటీల ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ టూరిజంలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై దానం ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :**

ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూంల లక్కీ డ్రాలో ప్రొటోకాల్ రగడ నెలకొంది. ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొని డ్రా ద్వారా లబ్దిదాలను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే రాకముందే అధికారులు లక్కీ డ్రాను ప్రారంభించారు. దీనిపై దానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని అధికారులపై సీరియస్ అయ్యారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన దానం.. కార్యక్రమం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు. కాగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా హైదరాబాద్ క్యూర్ పరిధిలో కొనసాగుతోంది. కోర్ అర్బన్ ప్రాంతంలోని తొలి విడతలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ నాలుగు రోజులపాటు పారదర్శకంగా జరగనుంది.

# రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావడంలో ఇక ఎలాంటి జాప్యం ఉండకూడదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వచ్చే పంటకాలానికైనా రైతులకు మేలు జరిగేలా విత్తన చట్టాన్ని అమల్లోకి తెచ్చే తదుపరి చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో విత్తన చట్టం2025పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, నాణ్యత, నియంత్రణ, విక్రయాలు, ధరల నియంత్రణతో పాటు విత్తన ఉత్పత్తి రైతుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం గతంలోనే ప్రత్యేక విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ కమిటీ రైతులు, విత్తన కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు, డీలర్లు, పంపిణీదారులు, వ్యవసాయ అధికారులతో సంప్రదింపులు నిర్వహించి, విత్తన రంగానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ సూచనల మేరకు విత్తన చట్టాన్ని తీసుకురావడానికి సిద్ధమవుతున్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం 'విత్తన చట్టం 2025' పేరుతో ముసాయిదా బిల్లును రూపొందించిందని పేర్కొన్నారు. కేంద్ర ముసాయిదా బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను తెలియజేస్తూ కొన్ని అంశాలను సమ్మతించడంతోపాటు మరికొన్ని అంశాలపై అభ్యంతరాలు, సూచనలు తెలియజేస్తూ కేంద్రానికి పంపించిందని తెలిపారు.

**ప్రపంచపటాలు పరిశీలించండి**

కేంద్రం నిర్ణయంతో సంబంధం లేకుండా ముందుకు

కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తన అభిప్రాయాలను పంపి నెలలు గడిచినా ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదని మంత్రి తుమ్మల అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టాన్ని త్వరగా తీసుకురావాలని పలుమార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం జాప్యం చేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ దేశంలోనే సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన నేపథ్యంలో విత్తన రంగానికి సమగ్ర చట్టపరమైన వ్యవస్థ ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకొచ్చినా, తీసుకురాకపోయినా రైతుల ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం అనుమతి లభించని పక్షంలో, రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ సూచనల మేరకు స్వయంగా విత్తన బిల్లును రూపొందించి శాసనసభలో ప్రవేశపెట్టి అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు.

**నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు – పరిహారానికి చట్టబద్ధత**

రైతులకు చట్టపరమైన రక్షణ: రైతు-విత్తన కంపెనీ మధ్య నేరుగా పారదర్శక ఒప్పంద వ్యవస్థ ఉండేలా చూడాలని, మధ్యవర్తుల పాత్రను నియంత్రించాలని సూచించారు.

న్యాయమైన ధర & బీమా: విత్తన ఉత్పత్తి రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పంట బీమా కల్పించాలని ఆదేశించారు. సత్వర నష్టపరిహారం: నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు సత్వరమే పరిహారం అందేలా యంత్రాంగంను ఏర్పాటు చేయాలన్నారు.

కఠిన నియంత్రణ వ్యవస్థ: విత్తన ఉత్పత్తి ప్రాంతాలను క్రాప్ బుకింగ్, Seed Traceability వ్యవస్థతో అనుసంధానం చేయాలని, మండల స్థాయిలో సీడ్ బ్యాంకులు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను ప్రోత్సహిస్తూ సంప్రదాయ విత్తన రకాలను పరిరక్షించాలని ఆదేశించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం, నకిలీ విత్తనాలను అరికట్టడం, పంట నష్టానికి పరిహారం కల్పించడం, విత్తన రంగంలో పారదర్శకత పెంపొందించడమే ఈ సమగ్ర విత్తన చట్టం ప్రధాన లక్ష్యాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## ములుగు హాస్పిటల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**హైదరాబాద్, ఆగస్టు 29 :**



ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) కోరారు. వైద్య ,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో సచివాలయంలో ఆమె శనివారం భేటీ అయ్యారు. ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు.

**అత్యవసర నిధులు, సిబ్బంది నియామకం**

హాస్పిటల్ లో డ్రైనేజీ, పారిశుధ్య పనుల కోసం అత్యవసరంగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. అలాగే రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఓపీ (అవుట్ పేషెంట్) గదుల నిర్మాణం కోసం రూ.2 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హాస్పిటల్ నిర్వహణ, సేవల మెరుగుదలకు 50 మంది వర్కర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు రూ.1.20 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. 132 టెక్నికల్ పోస్టులకు ప్రస్తుతం కేవలం 14 మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు అత్యవసరంగా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**అధునాతన వైద్య సదుపాయాల కల్పన**

క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల సౌకర్యార్థం అత్యవసరంగా ర్యాంప్ ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే 5 నుంచి 10 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కంటి సంబంధిత శస్త్రచికిత్సల కోసం క్రిటికల్ కేర్ బ్లాక్‌లో ఆధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలకు అత్యధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలంటే ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక పరిశోధన కేంద్రం**

ములుగు వంటి ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాధులపై ప్రత్యేక అధ్యయనం, నిర్ధారణ, చికిత్స కోసం ములుగు జిల్లాలో ఒక ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో కనిపించే ప్రత్యేక ఆరోగ్య సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, బాధితులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ పరిశోధన కేంద్రం ద్వారా ఆదివాసీ గిరిజనుల ఆరోగ్య పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి, దీర్ఘకాలిక వైద్య కార్యాచరణ రూపొందించవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని కూడా సీతక్క కోరారు. తన వినతిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంబంధిత అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చారన్నారు.



## మెట్రో స్టేషన్లలో ఆన్‌లైన్ సమస్యలు

**మొదటిపేజీ తరువాయి**

మెట్రో రైలు సేవలు సాఫీగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. మెట్రో స్టేషన్లలోనూ ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేవన్నారు. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో సేవలు సాఫీగానే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ లో ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు ఆలస్యంగా ఓపెన్ అయ్యాయని అధికారులు తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కారణంగానే గేట్లు తెరవడంలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. ప్రస్తుతం ఎల్బీనగర్ సహా ఇతర అన్ని మెట్రో స్టేషన్లలో సేవలు సాధారణ స్థితిలో కొనసాగుతున్నాయని ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు వెల్లడించారు. అయితే ఆన్‌లైన్‌లో ముందుగానే టికెట్లు కొనుగోలు చేసుకున్న ప్రయాణికులు ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద స్కానింగ్ సమస్యలు తలెత్తడంతో క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెట్రో స్టేషన్ సిబ్బంది కూడా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ టికెట్ తీసుకున్నాకా గేట్ల వద్ద వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తరచుగా ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవల్లో అంతరాయాలు ఏర్పడుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాలను ప్రమోట్ చేసేందుకు ఆ దేశానికి అన్ని విధాలా సహకరిస్తామని మారిషస్ ప్రతినిధులుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మహాత్మా జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా బృందం ఉప ముఖ్యమంత్రితో భేటీ శనివారం అయింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారితో మాట్లాడుతూ తెలంగాణమారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలున్నాయని అన్నారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య స్నేహపూర్వ సంబంధాలున్నామని గుర్తుచేశారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మారిషస్‌లోని తెలుగు సమాజం అక్కడి గొప్ప బహుళ సాంస్కృతిక సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. మారిషస్ ప్రభుత్వం చేపడుతున్న రామ భజన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాష, సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మారిషస్‌లోని తెలుగు కల్చరల్ సెంటర్‌లో లక్షలాదిమంది తెలుగు ప్రవాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను, భాష పరిరక్షణ చేస్తున్నారని మారిషస్ మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు, తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషికి వారు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.



# మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసింది కాంగ్రెస్సే

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 :**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ దేశంలో విభజన రాజకీయాలు చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీ డి.కె.అరుణతోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ...

దేశంలో అత్యధిక మత ఘర్షణలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదంతో సమన్యాయ పాలన అందిస్తోందన్నారు. కేంద్ర పథకాలు ముద్రా, జన్ ధన్, ఉజ్వల, ఉడాన్ వంటి కేంద్ర సంక్షేమ పథకాల ఫలాల్లో 22 శాతం నుండి 37 శాతం వరకు లబ్ధిదారులు మైనారిటీ వర్గాల వారే ఉన్నారని స్పష్టం చేశారు. విద్యార్థులకు భారీగా స్కాలర్‌షిప్‌లు, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రత్యేక ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించే చట్టమే సీఏఏ అని, అయితే కాంగ్రెస్ పార్టీ దీనిపై తప్పుడు ప్రచారం చేస్తూ అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర పన్నిందని మండిపడ్డారు. వందేమాతరం' ఏ మతానికీ వ్యతిరేకం కాదని, పవిత్రమైన భరతమాతను గౌరవించే జాతీయ గేయమని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనపై హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ వంటి దేశ భక్తులు సైతం వందేమాతరం నినదిస్తూ ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని కించపరచవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, గత బీఆర్ ఎస్ ప్రభుత్వాలు మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్లు, గన్‌మెన్లకే పరిమితమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా మరియు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా మైనారిటీ యువతకు వేలాదిగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రం ఓట్ల కోసమే మైనారిటీల పేరును వాడుకుంటోందని స్పష్టం చేశారు. అధికారంలో ఎవరున్నా వారికి వత్తాసు పలికే మజ్లిస్ పార్టీ నాడు బీఆఎస్‌తో, నేడు కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుందని, బీజేపీ పోరాటం వల్లే పాతబస్తీకి మెట్రో మంజూరైందని గుర్తుచేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై మజ్లిస్ అభ్యర్థిని గెలిపించాయని ఆయన గుర్తుచేశారు. నేడు అదే మజ్లిస్ ఎమ్మెల్సీ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్లు ఎందుకు నోరు మెదపడం లేదని రామచందర్ రావు సూటిగా ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీకి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ , ఈజిప్ట్, బహ్రెయిన్, జోర్డాన్ వంటి ప్రముఖ ఇస్లామిక్ దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలు అందించి గౌరవిస్తుంటే విపక్షాలు మాత్రం రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ మోదీ సంక్షేమ ఫలాలను గ్రామాలు, మండలాల వారీగా ఇంటింటికీ చేరవేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని మైనారిటీ మోర్చా శ్రేణులకు పిలుపునిచ్చారు.

## హెల్మెట్.. మీ రక్షణకు శ్రీరామరక్ష

### రక్షాబంధన్ సందర్భంగా ట్రాఫిక్ పోలీసుల వినూత్న అవగాహన



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**

రక్షాబంధన్ పండుగ సందర్భంగా రామగుండం ట్రాఫిక్ పోలీసులు వినూత్న రీతిలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్. శ్రీనివాస్ ఆదేశాల మేరకు మున్సిపల్ చౌరస్తా వద్ద శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించి వచ్చిన ద్విచక్ర వాహనదారులకు పోలీసులు రాఖీలు కట్టి, 'మీ రక్షణే.. మీ కుటుంబానికి శ్రీరామరక్ష' అనే సందేశాన్ని అందించారు. రాఖీ బంధం స్ఫూర్తిగా ప్రతి వాహనదారుడు తన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి. హరిశేఖర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

## ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు రాఖీ కట్టిన మాతృశక్తి

### నేను మీకు రక్ష.. మీరు నాకు రక్ష.. మనం దేశానికి, ధర్మానికి రక్ష' అంటూ సందేశం





**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**

రాఖీ పండుగ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి, దుర్గావాహిని బాధ్యులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 'నేను మీకు రక్ష.. మీరు నాకు రక్ష.. మనం దేశానికి, ధర్మానికి రక్ష' అంటూ నినాదం చేశారు. అనంతరం స్వీట్లు అందజేసి, హిందూ మహిళలకు రక్షణగా నిలవాలని కోరారు. అదేవిధంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ కె. శ్రీనివాస్‌కు కూడా రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షురాలు ఆరేళ్ల మమత, దుర్గావాహిని జిల్లా కన్వీనర్ కోట తిరుమల, నగర కన్వీనర్ శ్రీజ, నగర మాతృశక్తి కన్వీనర్ భవన్, కో–కన్వీనర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు..

### మణుగూరు ZPHS 10 క్లాస్ విద్యార్థులు.(95 - 96 బ్యాచ్).



**మణుగూరు.ఆగస్టు 29(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు లోని కోటకట్ట ప్రాంతానికి చెందిన దంసలపూడి నాగభూషణం అనారోగ్య కారణాల వల్ల శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న తనతో చదువుకున్నటువంటి చిన్ననాటి మిత్రులు, ప్రముఖ తెలుగు దినపత్రిక తెలుగు రాష్ట్రాల GM పసునూరి భాస్కర్, మరియు మిత్రుల సహకారంతో సంజీవని హాస్పిటల్ డాక్టర్ బుడగం రామకృష్ణ, మణుగూరు కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కురం రవి ముదిరాజ్,నూతి నాగేశ్వరరావు లు వారి ఇంటికి వెళ్లి నాగభూషణం పార్దేవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. నాగభూషణం సతీమణి స్వాతికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి వారికి అండగా నిలిచి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పొడుతురి రవి, నానాజీ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక మహిళల ఆత్మీయత.. వ్యాల్ల హరీష్‌రెడ్డికి రాఖీలు

- **రక్షాబంధన్ వేడుకల్లో కేసీఆర్ పాలనను గుర్తుచేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**



ఓల్డ్ అశోక్ మేస్త్రి అడ్డా టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక మహిళలు హరీష్‌రెడ్డికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కల్యాణలక్ష్మి , షాదీముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచిందని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని, రానున్న రోజుల్లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు మహిళలు, కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దిగువ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జహీద్ పాషా, బక్కి కిషన్, కృష్ణస్వామి, చొప్పరి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, మేకల రామస్వామి, రంగు దుర్గాప్రసాద్, బోట్ల పోషం, రౌతు గణేష్, రిషి, మామిడాల రాము, బోడకుంట వెంకటలక్ష్మి , కడార్ల శ్రీధర్, బండి రాజు, దిడ్డి కుమార్, కొండ సురేష్, నిజం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

### పద్మావతి కాలనీలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్, పద్మావతి కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ నాగండ్ల అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం పద్మావతి కాలనీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ నాగండ్లకు ఆయన సోదరి సునీత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీలోని పలువురు మహిళలు కూడా ఆయనకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ... రాఖీ పండుగకు అనాదిగా ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. అక్కాచెల్లెళ్లకు జీవితాంతం తోడుగా ఉంటాననే భరోసాను సోదరులు కల్పించే పవిత్ర బంధమే రాఖీ అని పేర్కొన్నారు. రక్షాబంధన్‌తో సోదరభావం, ప్రేమానురాగాలు మరింత బలపడతాయని అన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు రాఖీ పండుగను ఆనందంగా జరుపుకుంటారని తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కాలనీలో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. చెల్లెళ్లు, అక్కలు సోదరులకు రాఖీలు కట్టి ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.



సోదరులు వారికి కానుకలు, నగదు, మిఠాయిలు అందజేశారు. గోదావరిఖనిలోని రాఖీ, గిఫ్ట్, స్వీట్, పూల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. వివిధ రంగులు, డిజైన్లలో రాఖీలు, గిఫ్ట్ బాక్సుల కొనుగోలుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పాఠశాలల్లోనూ విద్యార్థులు రాఖీలు కట్టుకుని వేడుకలు జరుపుకున్నారు. కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు రక్షాబంధన్ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. మార్కెట్ ప్రాంతం, బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక పహారా ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి ప్రజలు రాఖీ పౌర్ణమిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం





- **జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభకు పదును.. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక**
- **యోగాతో ఆరోగ్యం.. ప్రశాంతత.. క్రమశిక్షణ: డాక్టర్ రవికుమార్ నాగండ్ల**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**

యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ అలవడుతాయని పెద్దపల్లి జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ నాగండ్ల అన్నారు. పెద్దపల్లి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అప్పన్నపేటలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. వివిధ వయసు విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ నాగండ్ల మాట్లాడుతూ.... ప్రస్తుత ఆధునిక జీవన శైలిలో ఒత్తిడి, ఆందోళన, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్ననాటి నుంచే యోగాను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని.. ఆరోగ్యకరమైన జీవన విధానమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో దాగి ఉన్న యోగా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు.

**యోగాతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు**

జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోతర్ల సాగర్ మాట్లాడుతూ.... యోగాలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు పోటీలతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగాల్లోనూ అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యోగాలో డిగ్రీ, పీజీ, ఎంఎస్సీ, పీజీ డిప్లొమా తదితర కోర్సులు చదివేందుకు ఉన్న అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యోగాను కేవలం పోటీలకే పరిమితం చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడమే తమ ఉద్దేశమన్నారు. యోగా ద్వారా వివిధ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందుతున్న వారి వివరాలను విద్యార్థులకు తెలియజేస్తున్నామని తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ఈ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడానికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో తమ తమ వయసు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు సెప్టెంబర్ మొదటి వారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు జాతీయ స్థాయికి, అక్కడ విజయం సాధించిన వారు అంతర్జాతీయ స్థాయికి వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించే వరకు అసోసియేషన్ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు.

**అప్పన్నపేటకు మంచి పేరు తీసుకురావాలి**

అప్పన్నపేట సర్పంచ్ ఆరే సంతోష్ మాట్లాడుతూ.. యోగా ద్వారా ఆరోగ్యం, ఆనందం పొందడంతో పాటు ఉన్నత విద్య, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు సాధించవచ్చన్నారు. యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి అప్పన్నపేట పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.పురుషోత్తం, పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జరీనా, జిల్లా యోగా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ దొడ్డే అవినాష్, కరీంనగర్ జిల్లా సెక్రటరీ, రాష్ట్ర అబ్జర్వర్ గుంటి రామకృష్ణ, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వేల్పుల సురేందర్, రీజినల్ మేనేజర్ బొల్ల మల్లేష్, రుషి యోగా ఫౌండర్ సునీత, అధికారులు రాజశేఖర్, ప్రశాంత్, ఆనంద్ కిషోర్, పీఈటీలు, పీడీలు దుర్గాప్రసాద్, భగేందర్, ఇర్ఫాన్, యశ్వంత్, శ్యామల, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విశేషంగా నిర్వహించిన "జంధ్యాల పౌర్ణమి" పూజా కార్యక్రమం

**మణుగూరు.ఆగస్టు 29 (డి డి 9వార్త)**

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి ని శ్రావణ పౌర్ణమి అని, రాఖీ పౌర్ణమి అని వివిధ రకాల పేర్లతో విశేష పూజలు నిర్వహిస్తుంటాం. ఇదే రోజున రక్షా బంధన్ పేరుతో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి తమ జీవితాలకు ఎల్లప్పుడూ రక్షగా ఉండమని కోరుకుంటారు. అయితే ఇదే శ్రావణ పౌర్ణమిని "జంధ్యాల పౌర్ణమి" అనే పేరుతో విశేషంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా శ్రావణ శుక్రవారం నాడు మణుగూరు పట్టణంలోని శ్రీ శ్రీ నగర్ లో గల పద్మశాలి



భవన్ నందు మణుగూరు పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "జంధ్యాల పౌర్ణమి" పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కుల బాంధవులందరూ నూతన యజ్ఞోపవీతదారణ చేసి, పాత యజ్ఞోపవీతాన్ని విసర్జించి, గాయత్రి మంత్రాన్ని జపిస్తూ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.యజ్ఞోపవీత ధారణ వలన జ్ఞానం కలుగుతుందని, యజ్ఞ యాగాలు చేసిన పుణ్యం లభిస్తుందని వేదోక్తి. ఈ పూజా కార్యక్రమాలలో మణుగూరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, మహేశ్వరపు రమేష్, గౌరవ అధ్యక్షులు కొరివి బసవయ్య, తుమ్మ లక్ష్మీ నారాయణ, కార్యదర్శులు కుర్రి నరసింహారావు, వెన్నం వెంకటరావు, సిరిపురం కోటేశ్వరరావు, గంగిశెట్టి శ్రీనివాసరావు, దాసరి విశ్వేశం, తాటి సత్యన్నారాయణ, దాసరి అనిల్ కుమార్, ఇనగాల వెంకటేశ్వర్లు, గుండారపు వెంకటేశ్వర్లు,ఆమంచి సత్యన్నారాయణ, భోగ గోపి, ఊసకోయల రాజశేఖర్, శ్రీరామ్ రమేష్, అడపా శ్రీనివాస్, ఇనగాల ఇస్తారి,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి

పీవైఎల్ జిల్లా నాయకుల డిమాండ్

**గుండాల, ఆగస్టు 29 డిడి 9వార్త:**

నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆపాలని, గ్రామీణ, పట్టణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూణే మంగయ్య, కోర్సా రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గుండాల మండలం కాంచనపల్లి గ్రామంలో నిర్వహించిన ఇల్లందు డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ, వైద్య, పోలీస్, రెవెన్యూ, విశ్వవిద్యాలయ శాఖల్లో ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి కొత్త ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందించాలని, పరిశ్రమల స్థాపన ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. యువత తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని




వారు పిలుపునిచ్చారు. అనంతరం పీవైఎల్ ఇల్లందు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊకే శ్రవణ్, కార్యదర్శిగా వెలుగు శాంతారావు, ఉపాధ్యక్షుడిగా ధారావత్ సుందర్, సహాయ కార్యదర్శిగా కల్తి సుదర్శన్, కోశాధికారిగా బానోత్ సురేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రశేఖర్, భయ్యా ఎంకన్న, చందావత్ లక్ష్మణ్, గంగావత్ జగదీష్, దారావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్‌లో అశ్వారావుపేటకు ప్రథమ స్థానం

- **జాతీయ స్థాయికి ఎంపికైన ఆసుపాక క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...**



**అశ్వారావుపేట:ఆగస్టు29(డిడి 9 వార్త)**

దమ్మపేట మండలంలో

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహించిన 18వ ఈషా గ్రామోత్సవం గ్రామీణ క్రీడా ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలోని రూరల్ ప్రీమియర్ లీగ్ 2026 లో అశ్వారావుపేట నియోజకవర్గం సత్తా చాటింది రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు దీంతో వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచింది ఈ సందర్భంగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జాతీయ స్థాయికి ఎంపికైన ఆసుపాక గ్రామ క్రీడాకారులను అభినందించి ఘనంగా సన్మానించారు రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకువచ్చిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు

గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారికి సరైన ప్రోత్సాహం అవకాశాలు లభిస్తే రాష్ట్ర జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగగలరని ఆశభావం వ్యక్తం చేశారు క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జాతీయ స్థాయి పోటీల్లో కూడా అశ్వారావుపేట నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు ఆసుపాక క్రీడాకారులు సాధించిన ఈ విజయం నియోజకవర్గంలోని ఇతర గ్రామాల యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు యువత చెడు వ్యసనాలకు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు గ్రామ యువత గ్రామ పెద్దలతో పాటు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- **అభ్యసన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
- **న్యాస్ పరీక్షల్లో ములుగు జిల్లాను ముందంజలో నిలపాలి**

**వాజేడు, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందిస్తూ, ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ శ్యాంసుందర్ రెడ్డి సూచించారు. వాజేడు నాగారంలోని జడ్పీహెచ్ఎస్‌లో వాజేడు, ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, వెంకటాపురం, మంగపేట మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల సముదాయ సమావేశం శనివారం నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ వాజేడు నాగారం ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంఈఓ శ్యాంసుందర్ రెడ్డి హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అభ్యసన మెరుగుదల కార్యక్రమాన్ని నిర్దేశిత విధానంలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు పీజీఐ సూచికలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని సులభతరమైన పద్ధతుల్లో విద్యార్థులకు బోధించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమగ్ర అభివృద్ధి పురోగతి కార్డులను ఎలా నమోదు చేయాలో ప్రతి ఉపాధ్యాయుడు తెలుసుకోవాలని అన్నారు. 2027–28 విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న న్యాస్ పరీక్షల్లో తెలంగాణ రాష్ట్రంతో పాటు ములుగు జిల్లాను కూడా మెరుగైన స్థానంలో నిలిపే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీయాలి వాజేడు మండల ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ శక్తికి



మించి పనిచేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని అన్నారు. ప్రతి విద్యార్థిలోని సామర్థ్యాలను గుర్తించి, వారు నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలను సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని అన్నారు. సముదాయ వనరుల వ్యక్తులు నునావత్ శ్రీకాంత్, ఎం. నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పీజీఐ సూచికలు, సమగ్ర అభివృద్ధి పురోగతి కార్డుల నమోదుతో పాటు ప్రతి ఉపాధ్యాయుడు బోధనా దినచర్య, పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ శ్యాంసుందర్ రెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, జడ్పీహెచ్ఎస్ వాజేడు నాగారం ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు, సముదాయ వనరుల వ్యక్తులు నునావత్ శ్రీకాంత్, ఎం. నాగేశ్వరావుతో పాటు ఐదు మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుష్కర పనులకు శ్రీకారం

- **రూ.49 కోట్లతో భద్రాచలంలో ఘాట్ల అభివృద్ధి**
- **మార్చి 30లోగా పనులు పూర్తి చేస్తాం: కలెక్టర్ అంకిత్**
- **భూమిపూజ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**



**భద్రాచలం, ఆగస్టు 29 (డిడి9 వార్త)**

భద్రాచలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. రూ.49 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు భూమిపూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జేసీబీతో మట్టి తొలగించి పనులను అధికారికంగా ప్రారంభించారు. తొలి విడతలో భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు చేపట్టి, మార్చి 30లోగా పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, బూర్గంపాడు మండలంలోని మోతే పట్టినగర్ ప్రాంతాల్లో ఘాట్ల నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోనూ పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. 2027 జూన్, జూలై నెలల్లో తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. వాజేడు, వెంకటాపురం తదితర సరిహద్దు ప్రాంతాల్లోనూ పుష్కర ఘాట్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయాలి**

పుష్కరాలకు వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా భద్రాచలం కరకట్ట ప్రాంతంలోని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల స్నానాలకు అవసరమైన సదుపాయాలతోపాటు మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, రాకపోకలకు అనువైన ఏర్పాట్లను పకడ్బందీగా కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఈవో దామోదర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ మహేశ్వరరావు, డీఈ భాగ్యరాజ్ రాథోడ్, ఈఈ జానీ, భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణ, పంచాయతీ ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ రవి, వార్డు సభ్యుడు సుబ్బారావు, స్థానికులు భోగాల శ్రీనివాస్‌రెడ్డి, బుడగం శ్రీనివాస్, ఏఈఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు..

## వాహనదారులు సరైన ధృవ పత్రాలను కలిగి ఉండాలని సూచన.

**మణుగూరు.ఆగస్టు 29 (డి డి 9వార్త)**



రోడ్డు ప్రమాదాల నివార ణ , అ సాంఘిక కార్యక్రమాల నియంత్రణ, ప్రజా రక్షణ చర్యలలో భాగంగా మణుగూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నాడు పట్టణం లోని అంబేద్కర్ సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన దారుల పత్రాలను పరిశీలించి,పత్రాలు సరిగా లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్ లను గుర్తించి వాటిని రికవరీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి అని, డ్రైవింగ్ లైసెన్స్, మరియు వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జ్యోతి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాఖీ కట్టాల్సిన రోజే తమ్ముడికి కన్నీటి వీడ్కోలు..

## రక్షా బంధన్ రోజున విషాదకర ఘటన.



**మణుగూరు.ఆగస్టు 29 (డి డి 9వార్త)**

రక్షాబంధన్ పండుగ రోజు అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ కట్టాల్సిన అక్కకు విషాదమే మిగిలింది. మణుగూరులో శుక్రవారం నాడు ఎం కె గ్యాంగ్ ఘర్షణలో మృతి చెందిన యువకుడు ,సింహాద్రి శివకుమార్ (శివ)కు అతని అక్క పల్లవి రాఖీ కడుతూ కన్నీరుమున్నీరుగా విలపించిన దృశ్యాలు అక్కడ ఉన్న వారి హృదయాలను కలిచివేశాయి.ఏటా సోదరుడి చేతికి రాఖీ కట్టి అతని క్షేమాన్ని కోరుకునే పల్లవి.. ఈసారి ఇక లేని తన తమ్ముడి చేతికి రాఖీ కట్టాల్సిన పరిస్థితి రావడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రాఖీ పండుగ రోజే అన్నాచెల్లెళ్ల బంధానికి కన్నీళ్లతో వీడ్కోలు పలికిన దృశ్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి.

# పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు

## మంత్రి సీతక్కకి ధన్యవాదములు తెలిపిన సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్

**తాడ్వాయి డిడి9 వార్త**



తాడ్వాయి మండలం ఊరట్టం ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధికి 7లక్షల రూపాయలు మంజూరు చేసినందుకు మంత్రి సీతక్కకి ధన్యవాదములు తెలుపుతున్నట్లు సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్ అన్నారు. మేడారంలో చెర్ప రవీందర్ మాట్లాడుతూ మాస్వంత గ్రామం అయినా ఊరట్టం మీద అభిమానంతో కోతుల సమస్య పరిష్కారం కోసం స్కూల్ కాంపౌండ్ వాల్ కు సోలార్ పెన్సింగ్, వాటర్ హీటర్ కు 4లక్షల రూపాయలు మరియు స్కూల్, హాస్టల్ మొత్తం సున్నం వేయుటకు 3 లక్షలు రూపాయలు మంజూరు చేసినందుకు గ్రామస్థులందరి తరపున మంత్రి సీతక్కకి ధన్యవాదములు తెలిపారు.

# ఎయిర్ పోర్ట్ టాక్సీలకు ఫిక్స్ డ్ రేట్ కార్డు అమలు చేయాలి




**జనగామ ఆగష్టు 29(డిడి 9 వార్త )బ్యూరో**

హైదరాబాద్ లో ఎయిర్‌పోర్ట్–సిటీ, సిటీ–ఎయిర్‌పోర్ట్ ప్రయాణాలకు ఫిక్స్‌డ్ రేట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (BRTU) డిమాండ్ చేసింది. టాక్సీ, క్యాబ్ డ్రైవర్లతో నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన రేట్ కార్డును మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. టాక్సీ, ఆటో, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు బేస్ ఫేర్, పర్ కిలోమీటర్, పర్ మినిట్ ఆధారంగా యూనిఫామ్ ఫెయిర్ విధానాన్ని అమలు చేయాలని BRTU ఉపాధ్యక్షులు, టాక్సీ, గిగ్ & ప్లాట్‌ఫామ్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షులు అత్తినమోని నాగేష్ కుమార్ కోరారు. ఎయిర్‌పోర్ట్ డ్రాప్ సమయంలో విధిస్తున్న భారీ పెనాల్టీలను పునఃసమీక్షించి, డ్రైవర్లకు కనీసం 10 నుంచి 15 నిమిషాల ఉచిత సమయం కల్పించాలని BRTU రాష్ట్ర అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు.

## ఉద్యోగుల క్వార్టర్ల కేటాయింపులో పారదర్శకత

### ఆర్జీ–1 పరిధిలో 319 క్వార్టర్లకు 6 మంది ఎంపిక.. 40 చేంజ్ క్వార్టర్లకు 10 మంది కేటాయింపు



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**

రామగుండం రీజియన్‌లో విధులు నిర్వహిస్తున్న మంత్లీ రేటెడ్ ఉద్యోగుల ఫ్రెష్ క్వార్టర్ అలాట్‌మెంట్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఆర్సీవోఏ క్లబ్‌లో నిర్వహించారు. క్వార్టర్ అలాట్‌మెంట్ కమిటీ ప్రతినిధిగా ఆర్జీ–1 పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి హాజరై కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఏ1 నుంచి హెచ్ గ్రేడ్ మంత్లీ రేటెడ్ ఉద్యోగులకు ఫ్రెష్ అలాట్‌మెంట్ కోసం మొత్తం 319 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 6 మంది ఉద్యోగులు తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. అలాగే సి నుంచి ఏ1 గ్రేడ్ ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కింద 40 క్వార్టర్లకు 10 మంది ఎంపికయ్యారు. కౌన్సెలింగ్‌లో డీ, టీ–2, ఎండీ, ఎస్టీ–2, ఐబీ కాలనీ, శారదానగర్, బస్టాండ్ కాలనీ, జీఎం ఆఫీస్ కాలనీ, మిలీనియం, పవర్‌హౌస్ కాలనీ, జవహర్‌నగర్, తిలక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని తమకు నచ్చిన క్వార్టర్లను ఉద్యోగులు ఎంపిక చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంస్థ నిబంధనల ప్రకారం క్వార్టర్లను కేటాయించారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియను ఎలాంటి వివక్షకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఫిరోజ్‌ఖాన్, పీఓఏ దేవాచారి, గుర్తింపు ప్రాతినిధ్య సంఘం నాయకులు మదన మహేష్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, సెక్యూరిటీ సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరట్టం ఆశ్రమ పాఠశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవం



**తాడ్వాయి DD9 వార్త**

తాడ్వాయి మండలంలోని ఊరట్టం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్తీ శ్రీనివాస్ చక్కగా విద్యార్థులతో మాట్లాడుతూ మన మాతృభాషను మరిచిపోకూడదు అందరు చక్కగా చదువుకోని మంచి లక్ష్యాన్ని వెన్నుకోవాలని చెప్పారు. అదేవిదంగా చదువు తోపాటు ఆటలు కూడా ఆడాలి, ఆటలు ఆడడం వలన భవిష్యత్ లో మంచి ఆరోగ్యం మీ సొంతం అవుతుంది అని అన్నారు. ఈకార్యక్రమం లో తెలుగు భాషపాధ్యాయుల గిడుగు సేవలను కొనియాడారు. వ్యాయమ ఉపాధ్యాయులు కూడా క్రీడాలగురించి గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టాప్ సెక్రటరీ, డిప్యూటీ వార్డెన్, మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు బీఆర్ ఎస్ పోరాటం

### సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల కార్యక్రమాలు

**జనగామ ఆగస్టు 29 (డిడి 9వార్త )బ్యూరో**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా అనేక హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, కోడకండ్ల, తొర్రూరు, పాలకుర్తి, పెద్దవంగర మండలాల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2,500, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పెన్షన్ల పెంపు, ఇందిరమ్మ ఇళ్ల హామీలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం ఉద్యమాలు, పోరాటాలు బీఆర్‌ఎస్‌కు కొత్త కాదని పేర్కొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలు కోసం సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ, యువజన, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

### శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి

**భద్రాచలం , ఆగస్టు 29 (సీడీ9 వార్త)**



శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భద్రాచలం ఆర్టీసీ ఇన్ గేట్ వద్ద కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్ కు చెందిన చంద్రశేఖర్ దంపతులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాగాపు రాజు ఆధ్వర్యంలో చంద్రశేఖర్ దంపతులను ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన కార్యక్రమం..

### పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.ఆగస్టు 29 (డి డి 9వార్త)**



అశ్వాపురం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ 37 సంవత్సరాల పాటు విద్యారంగానికి విశేష సేవలందించిన పూనెం వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన, వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై పూనెం వెంకటేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 37 ఏళ్ల సుదీర్ఘ కాలం ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ, వారి భవిష్యత్‌కు బాటలు వేసిన పూనెం వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

విద్యాబోధనతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఫ్లడ్ డ్యూటీ, జనాభా లెక్కలు, మండల రిసోర్స్ పర్సన్ (MRP) వంటి అదనపు బాధ్యతలను సైతం సమర్థవంతంగా నిర్వహించారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొనియాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడంతో పాటు కలెక్టర్ స్థాయిలో గుర్తింపు పొందడం ఆయన సేవలకు నిదర్శనమని అన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో, వారి విద్యాభివృద్ధికి తోడ్పడటంలో పూనెం వెంకటేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తి ద్వారా సమాజానికి సేవ చేసిన ఆయనకు ఉద్యోగ విరమణ అనంతరం కూడా ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పూనెం వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు, మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, పూనెం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి..

- డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు.

**మణుగూరు.ఆగస్టు 29 (డి డి 9వార్త)**



భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలం లోని గుట్ట మల్లారం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 49 లో గత ప్రభుత్వం గిరిజన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు కేటాయించిన భూమిలో అక్రమంగా గ్రావెల్ త్రవ్వకాలు జరుపుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవవాలి అని కోరుతూ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మణుగూరు మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. తక్షణమే అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలిపివేసి, అందుకు బాధ్యులైన గుత్తేదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అనీ డిమాండ్ చేసారు. లేనిపక్షంలో BRS పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయన్ని ముట్టడిస్తాం అని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.ఇదే విధంగా ప్రభుత్వ భూములను అదికార పార్టీ వత్తిళ్లకు తలొగ్గి వారికి అనుయాయులైన కాంట్రాక్టర్లకి దానదాత్తం చేస్తే భవిష్యత్తు లో ప్రజా అవసరాలకోసం మణుగూరు లో సెంటు భూమి కూడా మిగలదు అని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామారావు కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మరియు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మణుగూరు మండల మాజీ జెడ్పిటిసి పోశం నరసింహరావు, ముత్యం బాబు, అడపా అప్పారావు, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, నూకారపు రమేష్, కలగూర శంకర్, జావీద్ పాషా, ఎనిక ప్రసాద్, వావిలాల నర్సయ్య, తురక రామకోటి, మందరి సతీష్, కారం ముత్తయ్య, భోడా శ్రీను నాయక్, యువజన నాయకులు భోశెట్టి రవి ప్రసాద్, గుర్రం సృజన్, జక్కం రంజిత్, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి దోపిడీకి 'రివ్యూ' నాటకాలు!

- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో సింగరేణి సమీక్షపై మాజీ ఎమ్మెల్యే చందర్ ఫైర్
- ఆస్తులు, భూములను అప్పగించే కుట్ర.. కార్మికుల క్వార్టర్లు కూల్చేస్తారా!!

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 29 (డీడీ9 వార్త):**




సింగరేణి ఆస్తులు, భూములను దోచుకునేందుకే 'రివ్యూ' పేరుతో నాటకాలు ఆడుతున్నారని బీఆర్ ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ క్యాంపు కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్ ) సూర్యనారాయణ, జీఎంతో కలిసి సమీక్ష నిర్వహించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం రామగుండంలోని బీఆర్ ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడారు.

**ఎమ్మెల్యేకు ఆ అధికారం ఎవరిచ్చారు!!**

సింగరేణి వ్యాప్తంగా సమీక్ష నిర్వహించే అధికారం ఎమ్మెల్యేకు ఎవరిచ్చారని చందర్ ప్రశ్నించారు. సీఎండీ అనుమతించారా! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చారా! ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనుమతి ఉందా! అని నిలదీశారు. సింగరేణి అధికారులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పిలిపించి సమీక్షలు నిర్వహించడం కార్మికుల్లో అనుమానాలు, ఆందోళనలకు కారణమవుతోందన్నారు. ఓల్డ్ అశోక్ నగర్ లోని సింగరేణి భూములను అప్పగించేందుకు, ప్రైవేట్ నిర్మాణాల పేరుతో కాంగ్రెస్ నాయకులకు ప్రయోజనం కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చందర్ ఆరోపించారు. సింగరేణి స్థలాల్లో సంస్థకు సంబంధించిన బోర్డులు ఉండాల్సి ఉండగా కాంగ్రెస్ నాయకుల ఫొటోలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు నివాసముంటున్న క్వార్టర్లను ఖాళీ చేయించి కూల్చివేస్తూ వారిని రోడ్డున పడేస్తున్నారని చందర్ మండిపడ్డారు. కార్మికులు ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల క్వార్టర్లపై యాజమాన్యం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**సీఎండీ స్పష్టత ఇవ్వాలి**

సింగరేణి ఆస్తులు, భూముల విషయంలో జరుగుతున్న పరిణామాలపై సీఎండీ వెంటనే స్పందించి బహిరంగ ప్రకటన చేయాలని చందర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కు అండగా నిలుస్తున్నారని ఆరోపించిన డైరెక్టర్ సూర్యనారాయణను సస్పెండ్ చేయాలని కోరారు. సింగరేణి ఆస్తులను, కార్మికుల హక్కులను కాపాడేందుకు బీఆర్ ఎస్ వెనుకడుగు వేయదని, అవసరమైతే సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని చందర్ హెచ్చరించారు. సమావేశంలో మిర్యాల రాజారెడ్డి, కౌశిక్ హరి, నూనె కొమురయ్య, మురళీధర్ రావు, హరీష్ రెడ్డి, మాదరి రామమూర్తి, సంతోష్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హలో మాల - చలో సెక్రటేరియట్ కు భారీగా తరలి రండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కక్ష సాధింపు చర్యలు మానాలి...
- జీవో నెంబర్ 99 మాలల భవిష్యత్తుని చిద్రం చేస్తుంది...
- రోస్టర్ ని సవరించే వరకు పోరాటం ఆగదు....
- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు... పిల్లి సుధాకర్.

**పాల్వంచ, ఆగస్టు 29, ( డిడి9 వార్త)**



మాలల విద్య ఉద్యోగ అవకాశాలకు అడ్డంకి గా మారిన రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని, మాలల భవిష్యత్తుని అంధకారం చేస్తున్న 99 జీవో ని ఎత్తివేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలల విద్య, ఉద్యోగ అవకాశాలలో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరుతూ రేపు ( సోమవారం ) జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే చలో సెక్రెటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దానిలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని లారీ అసోసియేషన్ హాలో మాల చలో సెక్రెటేరియట్ కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరణ చేసి తప్పిదం చేయడమే కాక, రోస్టర్ పాయింట్లను కేటాయించడం, మాలల భవిష్యత్తుకు అంధకారంగా మారిన 99 జీవోని విడుదల చేసి మాలలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపట్ల కక్ష సాధింపు చర్యలకు దిగారని విమర్శించారు. దశాబ్దాలకాలంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వెన్ను దన్నుగా నిలుస్తున్న మాలలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, రోస్టర్ పాయింట్లను 20 పాయింట్లు రెండు పాయింట్లు కేటాయించాలని, మాలల భవిష్యత్తుని చిద్రం చేస్తున్న 99 జీవోని ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలల డిమాండ్ల సాధనకై రేపు ( సోమవారం ) జరిగే చలో సెక్రెటేరియట్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మాల విద్యార్థులు,ఉద్యోగులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్, సింగరేణి రిటైర్డ్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ అధ్యక్షులు వాసుమల్ల గౌతం, దారా సాత్విక్, గుండమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన తాటి. వెంకటేశ్వర్లు..





- **పరామర్శలు.. నివాళులు.. ఆర్థిక సాయం.. యువతకు వాలీబాల్ ల పంపిణీ**

**అశ్వారావుపేట: ఆగస్టు 29 (డిడి 9 వార్త)**

మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కష్టాల్లో ఉన్న పలువురికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. అలాగే కేశప్పగూడెం గ్రామంలోని యువతకు వాలీబాల్ లను పంపిణీ చేశారు. అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం గ్రామానికి చెందిన మల్లం నాగరాజు ఈ నెల 16న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కేశప్పగూడెం గ్రామంలోని యువకులకు వాలీబాల్ లను పంపిణీ చేశారు. యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. మామిళ్లవారిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లేటు శింగలదేవి పెద్దసత్యనారాయణ గారి సతీమణి వెంకటరమణ ని తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం గ్రామంలో టీఆర్ఎస్ నాయకులు పులగడప చిలగారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న తాటి వెంకటేశ్వర్లు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే గ్రామానికి చెందిన నులకని శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దబ్బాతోగు గ్రామంలో ఇటీవల మృతి చెందిన సోడియం వీరభద్రం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. గుమ్మడవల్లి గ్రామంలో షేక్ నాసర్ వాలి సతీమణి ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న తాటి వెంకటేశ్వర్లు ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో తాటి వెంకటేశ్వర్లు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శలతో పాటు ఆర్థిక సాయం అందిస్తూ, యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ తన సేవా కార్యక్రమాలను కొనసాగించారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాసానచంద్రమోహన్, మాజీ జెడ్పిటిసి అంకితం మల్లికార్జున రావు , మాజీ సర్పంచ్ పొట్ట రాజులు , జుజ్జూరపు శ్రీరామ్మూర్తి, గుడవర్తి వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ, ఆరేపల్లి గోవింద్, శెట్టిపల్లి రఘురాం తగరం జగన్నాథం , జుజ్జూర్పు రాంబాబు నార్లపాటి చిన్నబ్బాయి, తగరం హరి ,డాక్టర్ ముస్తఫా, కోర్రి రాజులు, కొర్రి సత్యనారాయణ ,తాండ్ర యుగేందర్, బొల్లికొండ చెన్నారావు, పానుగంటి లక్ష్మణరావు, కొనకళ్ళ శ్రీనివాస్, జుజ్జూరి సత్య నారాయణ,కోర్స ప్రతాప్, ఉప్పాల రత్నాకర్, పొన్నం బాబురావు, చిన్న సత్యనారాయణ, యాసం శ్రీను, మోటూరి చిలుకా రావు, కాటూరి రాంబాబు, పుల్లారావు, ఎస్.కె రెహమాన్ , సోమ్లా, లకావత్ వెంకటేష్, పొట్ట రాము , తాటి వెంకప్ప , తాటి వీరబాబు, నాగ మహేశ్వరరావు, జక్కుల రాంబాబు,పార్టీ సర్పంచ్ అభ్యర్థి నారం అనురాధ, వార్డు సభ్యురాలు కనకమ్మ, తోడేం అనురాధ, జక్కుల నాగమణి, అల్లం సీతారాములు, కౌవులూరి నరేష్, కాటూరి నాగు, యాదిరాజు దుర్గారావు, జక్కుల సందీప్, శానంపూడి వెంకన్నబాబు, జక్కుల సుధీర్, పల్లెల వెంకన్న, ఇట్టా సందీప్, కోట సింహాచలం, అల్లం ఎల్లయ్య, మారుతి కృష్ణ, పులగడప దుర్గారావు,మాజీ సర్పంచ్ ప్రసాద్, వీర్రాజు, సోడే కన్నమ్మ , మాజీ సర్పంచ్ మద్దిని కొండయ్య , సూరిబాబు, సీతా దేవి , పొదిలి మనోహర్ , మాజీ ఎంపిటిసి తిరుపతి రావు , నిర్మల పుల్లారావు వెంకటేశ్వరరావు , కృష్ణా రెడ్డి , షేక్ అమీర్ దేరంగుల సురేష్ , రవి , తదితరులు, యువకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం హోరెత్తిన 'టిడబ్ల్యూజేఎఫ్' పాదయాత్ర...

- **బోనకల్ లో ఘన స్వాగతం పలికిన ప్రెస్ క్లబ్ సభ్యులు...**
- **అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సంపూర్ణ సంఘీభావం...**
- **తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత..**
- **దివంగత జర్నలిస్ట్ సత్యానందం కుటుంబానికి పరామర్శ....**

**బోనకల్,ఆగస్టు 29, (డీడీ9 వార్త):**

జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన సొంతింటి స్థలాల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ చేపట్టిన మహా పాదయాత్ర శనివారం బోనకల్ మండల కేంద్రంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగింది. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డిల సమర్థవంతమైన నాయకత్వంలో సాగుతున్న ఈ పాదయాత్ర, శనివారం ఎర్రుపాలెం నుంచి మధిర మీదుగా బోనకల్ పట్టణానికి చేరుకోగా స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు.

అడుగడుగునా ప్రజా సంఘాల సంఘీభావ

అనంతరం బోనకల్ వేబ్రిడ్జి కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ప్రధాన వీధుల గుండా సినిమా హాల్ సెంటర్ వరకు అట్టహాసంగా సాగింది. అక్కడ ఉన్న బాబు జగజ్జీవన్ రావ్ విగ్రహానికి యూనియన్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి బిఆర్ఎస్, బిజెపి, టిడిపి, సిపిఎం, సిపిఐ, ఎమ్మార్పీఎస్ తదితర ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో పాటు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు నేరుగా పాల్గొని తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు.




**తహసీల్దార్‌కు వినతిపత్రం..**

అక్కడి నుంచి జర్నలిస్టులు భారీ ర్యాలీగా ప్రధాన రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతర పెండింగ్ సమస్యలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని తహసీల్దార్ సిహెచ్ సుధాకర్‌కు అందజేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు దక్కేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**దివంగత జర్నలిస్ట్ మందా సత్యానందం కుటుంబానికి పరామర్శ...**

అనంతరం, ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన జర్నలిస్ట్ మందా సత్యానందం నివాసానికి టిడబ్ల్యూజేఎఫ్ బృందం వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. వారి కుటుంబాన్ని పరామర్శించి యూనియన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అంతేకాకుండా, ప్రభుత్వం నుంచి అందవలసిన పరిహారం మరియు అధికారిక సహాయాన్ని త్వరలోనే అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.బోనకల్‌లో కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం, పాదయాత్ర ముగింపు సభను నిర్వహించేందుకు యాత్ర అక్కడి నుంచి చింతకాని వైపు పురోగమించింది.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, యూనియన్ వివిధ హోదాల్లోని ప్రతినిధులతో పాటు బోనకల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి, జర్నలిస్టులు బాజీ షరీఫ్, వై. గౌతమ్, షేక్ బడే, మాగి ముఖేష్, నాగటి రాజశేఖర్, షేక్ మధార్ సాహెబ్, తగరం రమేష్, తెల్లబోయిన సుమన్ తదితర జర్నలిస్టులు,స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడల దినోత్సవం

**బోనకల్,ఆగస్టు 29, (డీడీ9 వార్త):**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేజర్ ధ్యాన్ చంద్ గచిత్రపటానికి పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమా దేశిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ భారత దేశ హాకీ చేతులను కాకుండా ప్రపంచ హాకీ చరిత్రలో కూడా అత్యంత గొప్ప క్రీడాకారుల్లో ఒకరు.ప్రేమతో హాకీ మాంత్రికుడు అని పిలుస్తారు. ఆయన అసలు పేరు ధ్యాన్ సింగ్ ఆగస్టు 29 1905లో ఉత్తరప్రదేశ్లో జన్మించారు. వాళ్ళ నాన్నగారు సమేశ్వర్ సింగ్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో పనిచేసేవారు. ధ్యాన్ చంద్ చిన్నతనంలోనే క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు, తర్వాత భారత సైన్యంలో చేరి హాకీ ఆడడం ప్రారంభించారు ఆయన ఎక్కువగా రాత్రి సమయంలో సాధన చేసేవారని చెబుతారు చంద్రుని వెలుతురులో కూడా సాధన చేయడం వల్ల ఆయనకు చంద్ అనే బిరుదు వచ్చింది. ధ్యాన్ చంద్ భారత హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి మూడు ఒలంపిక్స్ బంగారు పథకాలు సాధించారు అవి 1928,1932,1936 సంవత్సరాలలో సాధించారు బెర్లిన్ ఒలంపిక్స్ లో భారత హాకీ జట్టు అత్యంత అద్భుతంగా ఆడి ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఖ్యాతిని పెంచింది. ధ్యాన్ చంద్ హాకీ స్టిక్ తో బంతిని అద్భుతంగా నియంత్రించేవారు ఆయన డ్రిబ్లింగ్ వేగం గోల్స్ చేయగల సామర్థ్యం చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోయేవారు అందుకే ఆయనను హాకీ విజార్డ్ అని ప్రపంచం గౌరవించింది. హాకీ క్రీడలో భారతదేశానికి చేసిన విశేష సేవలతో పాటు ఆయన భారత సైన్యంలో కూడా సేవలందించారు,తర్వాత ఆయనకు మేజర్ హోదా లభించింది. 1956 సం లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ పురస్కారం అందించింది. భారత ప్రభుత్వం ఆగస్టు 29 మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడల దినోత్సవంగా ప్రకటించింది. మేజర్ ధ్యాన్ చంద్ 3 డిసెంబర్ 1979 లో మరణించారు. ప్రతిభ ఒక్కటే విజయాన్ని ఇవ్వదు, క్రమశిక్షణ ,నిరంతర సాధన, దేశభక్తి కలిసినప్పుడు గొప్ప విజయాలు సాధించవచ్చు అనే సందేశాన్ని మేజర్ ధ్యాన్ చంద్ జీవిత చరిత్ర ద్వారా ప్రతి విద్యార్థి స్ఫూర్తిని పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ అంతోటి తిరుపతిరావు అధ్యాపకులు జోనతాన్ బాబు,రాజేంద్ర కుమార్,లక్ష్మీకాంతం, పద్మావతి,రామకృష్ణ,రమేష్, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ,యశోద,శాంతి ప్రియ,లైబ్రరీన్ మోహన్, యుడీసి మదర్ సాహెబ్, జశ్వంత్,అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.




## తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సీఎండీలతో జాయింట్ సమావేశం..



**మణుగూరు.ఆగస్టు 29 (డి డి 9వార్త)**

తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో TGGENCO, TGTRANSCO, TSSPDCL మరియు TSNPDCL సంస్థల సీఎండీలతో శనివారం నాడు జాయింట్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఉద్యోగులు, కార్మికులు మరియు ఆర్టిజన్లకు సంబంధించిన ప్రధాన డిమాండ్లతో పాటు మొత్తం 14 డిమాండ్లపై సవివరంగా చర్చించడం జరిగింది.జేఏసీ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యలను, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మేనేజ్‌మెంట్ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అలాగే, పెండింగ్ డిమాండ్లపై మరింత చర్చించేందుకు 15 రోజుల లోపు మరోసారి జాయింట్ సమావేశం నిర్వహించేందుకు మేనేజ్‌మెంట్ అంగీకరించింది. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, కో–కన్వీనర్ బీసీ రెడ్డి, కో–చైర్మన్లు మహేష్, వజీర్, అలాగే ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి, కన్వీనర్ సాయిలు మరియు ఇతర జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ మనోహర్, రాంజీ, నెహ్రూ, స్వామి, సదానందం, వెంకటేశ్వరులు, అరవింద్, గోవర్ధన్, శ్రీధర్ గౌడ్, తిరుపతి, మురళి, పవన్, సత్యనారాయణ రావు, భూపాల్ రెడ్డి, తాజా దిన్, శ్రీనివాసరెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సరళారెడ్డి మృతికి టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

### అనిల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన జర్నలిస్టు సంఘం నేతలు



**భద్రాచలం, ఆగస్టు 29 (డిడి9 వార్త )**

భార్య సరళారెడ్డి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం టీవీ9 రిపోర్టర్ కర్ర అనిల్‌రెడ్డిని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్యతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు శనివారం పరామర్శించారు. భద్రాచలంలోని అనిల్‌రెడ్డి నివాసానికి వెళ్లిన నాయకులు ఆయనను ఓదార్చి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం దివంగత సరళారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సరళారెడ్డి మృతిపై మామిడి సోమయ్య తీవ్ర విచారం వ్యక్తం చేసి, అనిల్‌రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిర్రా శ్రీనివాస్‌గౌడ్, ఎలుగోటి వెంకట్రావు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షుడు కందబోయిన నాగకృష్ణ, జి. గోపాలకృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సుంక మహేష్, మణుగూరు నాయకులు పొదిల సుబ్బారావు, భద్రాచలం నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు సరళారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనిల్‌రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఘనంగా క్రీడా దినోత్సవం



**అదిలాబాద్ జిల్లా, సోనాల/బోథ్ మండలం, డి డి 9 వార్తా:-**

వాగ్దేవి కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటుకోవాలని సూచించారు. మేనేజ్‌మెంట్ సభ్యులు కే. పోశెట్టి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రాజేశ్వర్, మల్లిక, ప్రశాంత్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో క్రీడా దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

## మత్తుపై అవగాహన కల్పించే లఘు చిత్రం..
### యువతను ఆలోచింపజేసే సందేశంతో తెరకెక్కుతున్న షార్ట్ ఫిల్మ్




**డిడి 9 వార్త గుడిహత్నూర్ :**

మత్తు పదార్థాల వల్ల యువత, కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిబింబిస్తూ, మత్తుకు దూరంగా ఉండాలనే సందేశంతో ఓ షార్ట్ ఫిల్మ్ తెరకెక్కుతోంది. కొండా ప్రశాంత్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం కోల నగేష్ అందిస్తున్నారు . గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తి జీవితంలో చోటుచేసుకునే పరిణామాలు, కుటుంబంపై పడే ప్రభావం, చివరకు జీవితాన్ని మార్చుకోవాల్సిన అవసరాన్ని ఈ లఘు చిత్రం ద్వారా చూపించనున్నట్లు కొండా ప్రశాంత్ తెలిపారు . యువతలో మత్తు పదార్థాలపై అవగాహన పెంచడంతో పాటు, "మత్తుకు దూరంగా ఉండండి.. జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించండి " అనే సామాజిక సందేశాన్ని ప్రేక్షకులకు అందించడమే లక్ష్యంగా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆంజనేయుడు విగ్రహం ప్రతిష్ఠాపన కి భూమి పూజ



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ /సోనాల, డిడి9 వార్తా:-**

బోథ్ మండల కేంద్రం లోని మైసమ్మ కాలనీ లో గల శ్రీ కేదారనాథ్ శివాలయం దగ్గర నూతనంగా ప్రతిష్ఠాపన చేస్తున్న ఆంజనేయుడు విగ్రహం కి శనివారం భూమి పూజ చేశారు త్వరలో నిర్మాణ పనులు అయ్యి ఆంజనేయుడి విగ్రహం ప్రతిష్ఠాపన చేస్తాం అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో లో ఆలయ కమిటీ సభ్యులు జైనూర్ నారాయణ,పాలిక్ రమేష్,తుమ్ గంగయ్య,మాసం అనిల్ కుమార్,ఆడెపు నరేష్,నరం శెట్టి ప్రకాష్,కమటం ఆకాష్,కట్కం మల్లికార్జున్ మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సాలూర చెక్పోస్ట్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై బోధన్ పట్టణానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఓ వృద్ధుడిని శనివారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. బోధన్ రూరల్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఓ వ్యక్తి వాహనంపై గంజాయి రవాణా చేస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. రూరల్ సీఐ విజయ్ బాబు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజశేఖర్ తమ సిబ్బందితో కలిసి సాలూర చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపిస్తున్న మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకాకు చెందిన లక్ష్మణ్ గంగగిరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, ఆయన వద్ద 4 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

మోపాల్ మండలంలోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, బోధనా సిబ్బంది వివరాలను ప్రధానోపాధ్యాయుడు శంకర్ ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా 1,120 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతుండటం, ఇక్కడి ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు రావడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలపడంతో, పాఠశాలను ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వాటిని సమీపంలోకి మార్చడం ద్వారా క్రీడా మైదానంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం లభిస్తుందని పేర్కొన్నారు. పక్కనే ఉన్న ప్రైవేటు స్థలాన్ని కూడా సేకరించి పాఠశాలను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

- భావితరాలకు తెలుగు భాష గొప్పతనాన్ని అందించాలి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా

**భద్రాచలం, ఆగస్టు 29 (డిడి9 వార్త )**

తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా అన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల ప్రాంగణంలో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హవీలా మాట్లాడుతూ.. తెలుగు భాషను నిత్యజీవితంలో విస్తృతంగా ఉపయోగించడం ద్వారా భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. గిడుగు రామ్మూర్తి పంతులు తన జీవితాన్ని తెలుగు భాష, సాహిత్య



అభివృద్ధికి అంకితం చేశారని పేర్కొన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమం ద్వారా తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేసిన గిడుగు రామ్మూర్తి పంతులును ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన ఆశయాలు, సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీను, బాటనీ విభాగాధిపతి డాక్టర్ నాగ సమీరా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎస్పీ అరుణ్‌కుమార్

**భద్రాచలం, ఆగస్టు 29 (డిడి9 వార్త )**

భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ అరుణ్‌కుమార్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ అరుణ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ.. ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు నిరంతరం చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, దేవాలయాల పరిసరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకో



వాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ 2.0లో ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. బీట్ వాహనాలతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే నియంత్రించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ తిరుపతి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# కనుగుట్టలో ఘనంగా అఖండ జ్యోతి కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్/సోనాల మండలం: డి డి 9 వార్తా:-**

గత 13 ఆగస్టు నుండి వచ్చే నెల 13 వరకు నిర్వహించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ సద్గురు సచ్చిదానంద శబరి మాతాజీ గారి అఖండ జ్యోతి కార్యక్రమం లో ఈరోజు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ గోడం నగేష్ గారు పాల్గొన్నారు.

✍ ఈ సందర్భంగా ఎంపి గారు మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించే మన భారతదేశం హైందవ సంస్కృతి ఎంతో గొప్పదని అన్నారు.

✍ ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీ గారిని ఊరేగింపులతో ఘన స్వాగతం పలికారు అఖండ జ్యోతి కార్యక్రమానికి రావాలని గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని గ్రామస్తుల కోరిక మేరకు గ్రామ పులిమేర నుండి శబరిమాత ఆలయం వరకు 30 లక్షలతో సిసి రోడ్డు, ఆలయ ఆవరణలో 10 లక్షలతో భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణం సైతం పూర్తి చేయడం జరిగింది. గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరించే ఎంపీ గారిని గ్రామస్తులు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.

✍ ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, మాజీ రైల్వే బోర్డు మెంబర్ జివి రమణ, బోథ్ , బజార్ హాత్నూర్ పీఏసీఎస్ చైర్మెన్లు కదం ప్రశాంత్, వెంకన్న, స్థానిక సర్పంచ్ అనిత రాజేందర్, ఆలయ కమిటీ అధ్యక్షులు కుమ్మరి భోజన్నా, నానం భోజరెడ్డి, మునిగేలా రమేష్, జీ.వెంకట్ రమణ, నానం రమణ, బీజేపీ మండల అధ్యక్షులు బోరే రవీందర్,



పోరెడ్డి శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, గాదె శంకర్, చట్ల ఉత్తం, విష్ణు, రాజేశ్వర్, బోజన్న తో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు భక్తులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డీఎంహెచ్ఓ రాజశ్రీ

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

బీపీ, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, బాధితుల నమోదులో వెనుకబడిన ఆశా, ఎఎన్ఎంలు తమ పనితీరును వారం రోజుల్లోగా మెరుగుపరుచుకోవాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ హెచ్చరించారు. శనివారం నిజామాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో తక్కువ పనితీరు కనబరుస్తున్న పలు యూపీహెచ్‌సీల ఎస్సార్ నగర్, మాలాపల్లి, వినాయక్ నగర్, అర్సపల్లి, సీఎస్ కాలనీ ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. మొత్తం జనాభాలో 30 ఏళ్లు పైబడిన వారు సుమారు 56 శాతం ఉంటారని, వారందరికీ ఎన్‌సీడీ స్క్రీనింగ్ పూర్తి చేసి 'ఆభా' ఐడీలు సృష్టించాలని ఆదేశించారు. స్క్రీనింగ్‌లో బీపీ 26 శాతం, మధుమేహం 13 శాతం వరకు నమోదయ్యే అవకాశం ఉన్నందున.. కొత్తగా గుర్తించిన కేసులు ఆన్‌లైన్‌లో సరైన విధంగా కనిపించేలా సంబంధిత మెడికల్ ఆఫీసర్ లాగిన్‌లో తప్పనిసరిగా ధృవీకరించాలన్నారు. బాధితులకు వెంటనే మందులు ప్రారంభించి, ప్రతి 28 రోజులకు ఒకసారి ఫాలో-అప్ నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. వైద్య అధికారులు సైతం ప్రతిరోజూ ఏఎన్ఎంల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికిందర్ నాయక్, పీఓఎన్‌సీడీ డాక్టర్ వెంకన్న, సంబంధిత ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పోకుండా చూడాలి

- ఎస్ఐఆర్ నోటీసులపై అధికారులను ఆరా తీసిన పోచారం శ్రీనివాసరెడ్డి
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో లబ్ధిదారులకు కార్డులు అందజేత

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 29(డిడి9 వార్త):**

అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు.బాన్సువాడ గ్రామీణ మండలం తన స్వగ్రామమైన పోచారంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు తన చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల



ద్వారా రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత పెరుగుతుందని అన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఎస్ఐఆర్ నోటీసులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అర్హులైన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్ల కారణంగా కూడా అర్హులైన



వారి ఓటు హక్కు తొలగిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు.ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, బాన్సువాడ గ్రామీణ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# డైట్ కళాశాలలో 'అష్టావధానం' అలరింపు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థి భానోత్ నితిన్ నిర్వహించిన అష్టావధానం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రిన్సిపల్ తిరుక్కోవల్లూరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు డాక్టర్ గణపతి అశోక శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా తల్లావజ్ఝల మహేష్ బాబు, చిత్రకళ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రాశ్నికులుగా వ్యవహరించిన డాక్టర్ గంట్యాల ప్రసాద్ (నిషిద్ధాక్షరి), కోకిల



నాగరాజు (అప్రస్తుత ప్రసంగం)లతో పాటు పలువురు విద్యార్థులు అడిగిన క్లిష్టమైన ప్రశ్నలకు అవధాని నితిన్ కవిత్వ ధారతో చకచకా పద్యాలు పూరించి శభాష్ అనిపించుకున్నాడు. మట్టి గణపతులు– పర్యావరణం, ఆదర్శ ఉపాధ్యాయులు, వర్షాలు, తెలుగు భాషా పరిరక్షణ వంటి పలు అంశాలపై ఆశువుగా పద్యాలు చెప్పి అందరినీ మంత్రముగ్ధులను చేశాడు. సమయస్ఫూర్తితో నితిన్ ఇచ్చిన సమాధానాలకు సభలో చప్పట్ల వర్షం కురిసింది. విద్యార్థి దశలోనే అవధాన ప్రక్రియలో అద్భుత ప్రతిభ కనబరచడం విశేషమని ప్రిన్సిపల్ శ్రీనివాస్ కొనియాడారు. తన ప్రశిష్యుడు అవధానిగా రాణించడం ఎంతో గర్వకారణంగా ఉందని ముఖ్య అతిథి అశోక శర్మ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అవధాని నితిన్‌ను అతిథులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు సంజీవరావు, డాక్టర్ అన్నందాస్ జ్యోతి, అరవింద్, ప్రతిభ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామేశ్వరం పల్లి పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా





- **రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
- **ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**
- **భిక్కనూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీకి రూ.200 కోట్లు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 29(డిడి9 వార్త):**

కామారెడ్డి నియోజకవర్గం బిక్కనూర్ మండలం రామేశ్వరం పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పీఏసీఎస్ చైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, నూతన పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్, పాలకవర్గ సభ్యులను నాయకులు అభినందించారు.

**రైతుల ఆర్థిక అభివృద్ధికి పీఏసీఎస్ లు కీలకం**

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారుతుందని పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి వెన్నెముకగా ఉన్న రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు అవసరమైన పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.పీఏసీఎస్ లు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమస్యలకు పరిష్కారం చూపే కేంద్రాలుగా మారాలని అన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు నేరుగా సేవలు అందించడంలో నూతన పాలకవర్గాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం, గ్రామీణ మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు.

**భిక్కనూర్‌లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్**

కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని షబ్బీర్ అలీ తెలిపారు. నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు అయ్యాయని, దీనిని బిక్కనూర్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని, అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.నూతన పీఏసీఎస్ చైర్మన్ బద్దం ఇంద్రకరణ్ రెడ్డిని అభినందించిన షబ్బీర్ అలీ, రైతులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమాన సేవలు అందిస్తూ సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

**రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎంపీ షట్కర్**

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు.కొంత ఆలస్యం కావచ్చుని, అయితే ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు.రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పుల భారంలోకి తీసుకెళ్లారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుంటూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తోందన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడంలో పీఏసీఎస్ చైర్మన్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే సేవలు అందించేలా సహకార సంఘాలు పనిచేయాలని కోరారు.

**భారీగా హాజరైన నాయకులు, రైతులు**

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాజీ డీసీసీబీ అధ్యక్షులు ఎడ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, ఇరేని సందీప్, పలువురు సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 29(డిడి9 వార్త):**

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు.కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో



స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు సులభంగా పొందడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు అర్హత లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సాధికారత పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు తదితర అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని షబ్బీర్ తెలిపారు.రోడ్లు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు.జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ప్రజలకు ఉపయోగపడే పథకాలను సమన్వయంతో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐరేని నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మండల అధ్యక్షులు ఆశబోయిన శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, మాజీ జడ్పీటీసీ తిరుమల్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వినీత్, గ్రామ అధ్యక్షులు మధు, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అబ్రబోయిన స్వామి, గోపాల్ రెడ్డి, సిద్ధారం, ఈశ్వర్ గౌడ్, లింగం, సాయిలు, కవిత, శ్రీహరి, నరేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, సంజీవ్, రామస్వామి గౌడ్, సిద్ధారెడ్డి, బాపురెడ్డి, అంజం, జగ్గారెడ్డి, ముత్తాగౌడ్, నర్సింలు, బాలరాజ్ తదితరులు, పాత్రికేయ మిత్రులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నీట్ (పీజీ) పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్




**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

జిల్లాలోని నీట్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 265 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానుండగా.. అర్సపల్లిలోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్‌లలో ఏర్పాటు చేసిన సెంటర్లను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలు, ఇంటర్నెట్ వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, కేంద్రాల వద్ద తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని.. అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ రవికుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ఏసీపీ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

# నగరంలోని పలు డివిజన్లలో కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా కమిషనర్ దిలీప్ కుమార్ శనివారం పలు డివిజన్లలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. డివిజన్లోని 29, 30, 31, 54లలో పర్యటించి ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పంపిణీ, వాటి స్వీకరణ ప్రక్రియల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన నోటీసుల వివరాలను ఎలాంటి లోపాలు లేకుండా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నమోదు చేయాలని ఎన్నికల సిబ్బందికి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్దేశిత నిబంధనల ప్రకారం వేగవంతంగా, పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పాంచజన్య సంకల్ప సభను జయప్రదం చేయండి

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**



ఈ నెల 31న నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప సభ'ను జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని టీఆర్ఎస్ నాయకుడు, బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించి, మొదటిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న అధినేత్రి కల్వకుంట్ల కవితక్కకు శ్రేణులంతా ఘన స్వాగతం పలికేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా 'పాంచజన్య' విధానాలను ఈ సభ ద్వారా ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కవితక్కకు అండగా నిలవాలని, సభకు మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆశీర్వదించాలని కోరారు.

# విచారణ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 29(డీడీ9 వార్త) :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా విచారణ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నోటీసుల పంపిణీ, విచారణ అంశాలపై సూచనలు చేస్తూ.. పారదర్శక ఓటరు జాబితాల రూపకల్పనకు బీఎల్వోలకు దిశానిర్దేశం చేయాలని పేర్కొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో విచారణ కోసం 4,32,401 నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటికే 56,678 మందికి అందజేసినట్లు తెలిపారు. నోటీసుల పంపిణీకి అత్యంత ప్రాధాన్యమిచ్చి క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ గరిష్ఠ సంఖ్యలో అందజేసి అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని స్పష్టం చేశారు. మండలాల వారీగా పురోగతిని పర్యవేక్షిస్తూ, పెండింగ్ ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518**